క్లుప్తంగా

ఒకరికి పాజిటివ్

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన కోవిడ్ టెస్టులలో ఒకరి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరదాచారి తెలిపారు. 9 మందికి రాపిడ్ యాంటిజెన్ టెస్టులు చేయగా అందులో ఒకరికి కొవిడ్ పాజిటివ్‌గా తేలిందని ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నానక్‌రాంగూడ విలేజ్, సుమధుర అపార్ట్‌మెంట్స్, ద శ్రీరామ స్కూల్, గోల్ఫ్ వ్యూ అపార్ట్‌మెంట్స్, బౌల్డర్‌హిల్స్, వజ్రం అపార్ట్‌మెంట్స్, వైజయంతి అపార్ట్‌మెంట్స్, ఎస్‌వీడియో, నానక్‌రాంగూడ, ప్రైమ్ అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లో రూ.25 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ గురువారం అర్ధరాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీను, సోమిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సతీష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీఓఈ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు

పటాన్‌చెరు టౌన్: గురుకులాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల కోసం సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) ప్రవేశ పరీక్ష ఈ నెల 12న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. మండల పరిధిలోని పెద్దకంజర్ల ప్రభుత్వ గిరిజన బాలుర డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 10 నుంచి 1గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. మొత్తం 432 మంది ఈ పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, పూర్తి వివరాలకు 90000 49142, 99129 34380 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సావిత్రీబాయి సేవలు మరువలేనివి


నివాళి అర్పిస్తున్న శ్రీకాంత్ గౌడ్,నాయకులు

పటాన్‌చెరు టౌన్: మహిళా విద్య కోసం పాఠశాలలు స్థాపించి, విద్యాభివృద్ధికి కృషి చేసిన సావిత్రీబాయి పూలే సేవలు మరువలేనివని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో సావిత్రీబాయి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సాయి, షకీల్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐలు రాములు, ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో, ఇస్నాపూర్ చౌరస్తాలో ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు.

ట్యాంకర్ ఢీ కొని ఐటీ ఉద్యోగినికి తీవ్ర గాయాలు

గచ్చిబౌలి: వేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఐటీ ఉద్యోగినికి తీవ్ర గాయాలైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. గౌలిదొడ్డిలో నివాసముండే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రీజ (20) శుక్రవారం ఉదయం 10.45 సమయంలో స్కూటీపై విప్రో వైపు వెళుతుండగా క్యూసిటీ సమీపంలో వెనక నుంచి వాటర్ ట్యాంకర్ ఢీ కొంది. ఈ ఘటనలో గాయాలపాలైన శ్రీజను ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంగడి.. అనువైన స్థలమేదీ?



నానక్‌రాంగూడలోని ప్రధాన రోడ్ల మీద సంతలు నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్లపై సంతల నిర్వహణతో రాకపోకలకు తప్పని ఇబ్బందులు

రాయదుర్గం: సంతలకు ఆదరణ తగ్గలేదు. ముఖ్యంగా తాజా కూరగాయలు, ఆకుకూరలు....పండ్లు...దుస్తులు.. తినుబండారాలు.. నిత్యావసర వస్తువులు.. ఇలా అన్ని దొరుకుతుండడంతో కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వారం రోజులు ఏదో ఒక ప్రాంతంలో నిర్వహిస్తుండడంతో ఆయా కాలనీలు, బస్తీలవాసులకు సులువుగా మారింది. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో మొదట్లో రాయదుర్గం, నానక్‌రాంగూడలలో మాత్రమే సంతలను నిర్వహించేవారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఈ సంతలు కిటకిటలాడుతున్నాయంటే వీటి ప్రాధాన్యత అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఖాజాగూడ, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి తండా, గోపన్‌పల్లి, ఎన్టీఆర్ కాలనీ, జీపీఆర్‌ఏ క్వార్టర్స్, మధురానగర్, టెలికామ్‌నగర్ వంటి ప్రాంతాల్లో కూడా సంతలు విస్తరించాయి.

ప్రత్యేక స్థలం కేటాయించాలి..

- ప్రతి కాలనీలో సంత నిర్వహిస్తున్నా సౌకర్యాలు లేక విక్రయదారులు అవస్థల పాలవుతున్నారు.
- సంతలకు ప్రత్యేక స్థలం కేటాయించి, పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించాలి.
- ప్రధానరోడ్డుపైనే నిర్వహిరచడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.
- కొన్నిచోట్ల వీధిదీపాలు వెలగడం లేదని, మూత్రశాలలు లేవని అంటున్నారు.
- రెండు, మూడు కాలనీలు, బస్తీలకు కలిపి మినీ రైతుబజార్ల తరహాలో ఏర్పాటు చేస్తే అందరికీ అందుబాటులో ఉంటుంది.
- గచ్చిబౌలి డివిజన్ పరిధిలో సోమవారం తప్ప అన్నిరోజుల్లో ఏదో ఒక చోట సంతలు నిర్వహిస్తున్నారు.
- నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, ఖాజాగూడ, రాయదుర్గం, గోపన్‌పల్లి ,ఎన్టీఆర్‌నగర్ కాలనీ, ఉర్దూ యూనివర్సిటీ, గోపన్‌పల్లితండా, మధురానగర్ ,జీపీఆర్‌ఏ క్వార్టర్స్ కాలనీల్లో రోడ్లపైనే సంతలు జరుగుతున్నాయి.

అందుబాటులోకి రాని మోడల్ మార్కెట్‌లు....

- సంతలు పెరుగుతున్న నేపథ్యంలో మోడల్ మార్కెట్లు నిర్మించాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది.
- అందులో భాగంగా గచ్చిబౌలి డివిజన్‌కు 2 మోడల్ మార్కెట్‌లు మంజూరు చేస్తూ రూ. కోటి నిధులు ఎనిమిదేళ్ల క్రితం మంజూరు చేశారు..
- దీంతో టీఎన్‌జీఓ కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించారు. కానీ ఇంకా అందుబాటులోకి తీసుకురాలేకపోయారు.
- కాగా మరొకటి ఖాజాగూడలో స్థలం లేకపోవడంతో నిర్మాణం చేపట్టలేకపోయారు.

సౌకర్యాలు కల్పించాలి



ప్రతి కాలనీ, బస్తీల్లో సంతలు జరుగుతున్నాయి. వాటిని ప్రత్యేక స్థలంలో నిర్వహించడంతో బాటు విక్రయదారుల కోసం వసతులు కల్పించాలి. ఎక్కువ శాతం ప్రజలు సంతలకు మొగ్గు చూపుతున్నారు. వాటి నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలి.

–రమేష్‌గౌడ్, మధురానగర్

మినీ రైతుబజార్లు ఏర్పాటు చేయాలి



కాలనీల్లో మినీ రైతు బజార్లు ఏర్పాటు చేయాలి. సంతల్లో కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్న నేపథ్యంలో ప్రత్యేక స్థలం కేటాయించి, సౌకర్యాలు కల్పిస్తే అన్ని వస్తువులు ఒక్కచోటే లభిస్తాయి. మా నానక్‌రాంగూడలో ప్రధానరోడ్డుపైనే సంత జరుగుతోంది.

–శ్రీకాంత్‌రెడ్డి ,నానక్‌రాంగూడ

ఓర్పు, సహనం మహిళలకే సాధ్యం


వేడుకలో ఎమ్మెల్యే గాంధీ, ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: మహిళలు అన్ని రంగాలలో రాణించడంతో బాటు ఇతరులకు ఆదర్శం కావాలని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో రాయదుర్గంలో ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్ రెడ్డితో కలిసి జ్యోతి వెలిగించి మహిళా దినోత్సవ వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీపడాలన్నారు. సీఎం కేసీఆర్ మహిళా పక్షపాతి అని, మహిళా సంక్షేమానికి పలు పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచిందని, గతంలో మోడీ హైదరాబాద్ వచ్చినపుడు గ్యాస్ ధరలు తగ్గిస్తామని చెప్పి నేడు అమాంతం పెంచి భారం మోపారని విమర్శించారు. అనంతరం ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ పట్టుదల, ప్రేమ, నిబద్ధత, ఓపిక మహిళలకే సాధ్యమన్నారు.మాజీ కార్పొరేటర్ సాయిబాబా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహిళలకు ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కార్మికులు, ఆశావర్కర్లకు సన్మానించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ మహేష్, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ సురేష్, శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలజ, పలువురు నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



శేరిలింగంపల్లి: లింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు ఆర్.కె.వై ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు. ఆర్.కె.వై టీం సభ్యులు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే టెన్త్ విద్యార్థుల కోసం అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే స్టడీ మెటీరియల్ తయారు చేయించి అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శైలజ, భూమయ్య, బీజేపీ సీనియర్ నాయకులు ఎల్లేష్, సోమయ్య యాదవ్, మాధవి, కిషోర్, అరుణ్‌యాదవ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అందమైన,సున్నితమైన భాష



హర్యానా అశోకా యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ పెగ్గీమోహన్

రాయదుర్గం: ఉర్దూ చారిత్రాత్మక భారతీయ భాష అని హర్యానా అశోకా యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ పెగ్గీమోహన్ అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలో మనూ సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియంలో 'ది స్టోరీ అండ్ ప్రీ హిస్టరీ ఆఫ్ ఉర్దూ' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉర్దూ స్థానిక సంస్కృతిని కలిగి ఉంటుందని, ఇది అందమైన, సున్నితమైన భాష అని పేర్కొన్నారు. వివిధ పేర్లతో పిలిచే కాలంలో ఉర్దూ ఎలా పరిణామం చెందిందో వివరించారు. ఉర్దూలో ఉజ్బెక్ భాష ప్రభావం ఉందని ఆమె పేర్కొన్నారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ ఏ భాష లోనైనా స్థానిక సంస్కృతి చాలా బలంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రొఫెసర్ పెగ్గీమోహన్ ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో దక్కన్ కల్చర్, హెరిటేజ్ నిపుణులు సజ్జద్‌షాహిద్, ప్రొఫెసర్ నసీముద్దిన్ ఫరీస్, ప్రొఫెసర్ సయ్యద్ ఇంతియాజ్ తదితరులు ప్రసంగించారు.

అదృశ్యమై.. ఆపై శవమై

పటాన్‌చెరు టౌన్: అదృశ్యమైన ఓ యువకుడు పెద్ద చెరువులో శవమై తేలాడు. అమీన్‌పూర్ ఎస్ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం..మండలపరిధిలోని కిష్టారెడ్డిపేట మైత్రిమెడోస్‌కు చెందిన రవీందర్‌రెడ్డి(29) బీటెక్ చదివాడు.

కొంతకాలంగా అనారోగ్యంతోపాటు మానసిక స్థితి బాగాలేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 8వతేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు రవీందర్ కోసం వెతుకుతున్నారు. శుక్రవారం మైసమ్మ దేవాలయ సమీపంలో పెద్దచెరువులో రవీందర్ మృతదేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో శిక్షణ, ప్లేస్‌మెంట్ సెల్ షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సహకారంతో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను మార్చి 13 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ మహ్మద్ యూసుఫ్ ఖాన్ శుక్రవారం తెలిపారు.ఈ ప్లేస్‌మెంట్ కేవలం బీఈడీ, ఎంఈడీ పాసైన విద్యార్థులు (దూర విధానం)కు అవకాశం ఉంటుందన్నారు.

999 రూపాయలకే డయాలసిస్ సేవలు

- కల్వరి టెంపుల్ అధినేత బ్రదర్ సతీష్
- కల్వరి టెంపుల్‌లో డయాలసిస్ సెంటర్ ప్రారంభం

హఫీజ్‌పేట్ : కల్వరి టెంపుల్‌లో 999 రూపాయలకే డయాలసిస్ సేవలు అందిస్తున్నామని కల్వరి టెంపుల్ అధినేత బ్రదర్ సతీష్, సునీత్రిలు అన్నారు. శుక్రవారం మియాపూర్ కల్వరి టెంపుల్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలన్న మానవత దృక్పథంతో డయాలసిస్ సెంటర్‌ను నెలకొల్పడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు కల్వరి టెంపుల్ ఆసుపత్రిలో 55వేల మందికి వైద్యం అందించామని పేర్కొన్నారు.

సైకిల్ పైనుంచి పడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: ప్రమాదవశాత్తు సైకిల్ పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం.. శేరిలింగంపల్లి గోపీనగర్‌కు చెందిన కుమ్మరి నర్సింలు(53) కూలీ. గురువారం తన సైకిల్‌పై ఇస్నాపూర్‌కు బయలుదేరాడు. పటాన్‌చెరు శివారులోకి రాగానే రోడ్డు పక్కన వర్షపు నీరు పోయే కాలువలో ప్రమాదవశాత్తు పడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థి అదృశ్యం



గచ్చిబౌలి: స్కూల్‌కు వెళుతున్నానని చెప్పి వెళ్లిన విద్యార్థి అదృశ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రమోద్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడ జడ్పీహెచ్‌ఎస్‌లో పదవ తరగతి చదువుతున్న యశ్వంత్‌సాగర్(15) కుటుంబం అంజయ్యనగర్‌లోని శ్రీ ఆంజనేయ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటున్నారు. ఈ నెల 9న ఉదయం 8.10 గంటల సమయంలో స్కూల్‌కు వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. సాయంత్రం 6 గంటలకు వచ్చే యశ్వంత్ తిరిగిరాలేదు. పరిసర ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభించలేదు. ట్యూషన్ ఫీజు కోసం తల్లి లావణ్య వద్ద వెయ్యి రూపాయలు తీసుకున్నాడు. రెండేళ్ల క్రితం కూడా ఇంట్లో చెప్పకుండా వెళ్లి కొద్ది రోజులకు తిరిగి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్రాభివృద్ధే ధ్యేయంగా సాగుతాం

ఎంపీ రంజిత్‌రెడ్డి


బల్క్ చికెన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తామని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్, కృష్ణకాలనీలలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తామని, దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలో ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, సాంబశివరావు, రఘునాథ్, గుమ్మడి శ్రీనివాస్, శ్యామ్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్ 21 ఏఎంహెచ్‌ఓపై ఎంపీ రంజిత్‌రెడ్డి ఆగ్రహం

మాదాపూర్ డివిజన్ పరిధిలో ఆదిత్యనగర్‌లో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీలు పాదయాత్ర సమయంలో బస్తీలోని బల్క్ చికెన్ సెంటర్‌ను సందర్శించారు. చికెన్ సెంటర్‌లో అపరిశుభ్రతపై జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఎంపీ, ఎమ్మెల్యే వద్ద వాపోయారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏఎంహెచ్‌ఓ కార్తీక్‌పై చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శంకరయ్యకు వారు ఫిర్యాదు చేశారు.

ఇష్టపడి చదవండి..లక్ష్యాన్ని సాధించండి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రతి విద్యార్థి జీవితంలో 10వ తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సౌజన్యంతో నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న ఐదువేల మంది విద్యార్థులకు మానసిక వ్యక్తిత్వ నిపుణుడు డాక్టర్ సతీష్ మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. అనంతరం ప్రతి విద్యార్థికి స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్, పెన్నులు పంపిణీ చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ విద్యారంగానికి వేలకోట్ల రూపాయలు కేటాయిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని పదవ తరగతి విద్యార్థులందరికీ సొంత ఖర్చుతో అత్యంత విలువైన సమాచారంతో కూడిన స్టడీ మెటీరియల్, పరీక్ష సామగ్రి పంపిణీ చేశామన్నారు.పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులందరూ ఫోన్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు సైతం సహకారం అందించాలన్నారు.

ఒత్తిడికి గురికాకుండా చదవండి: డా.సతీష్

విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఇష్టపడి చదవాలి. ఒత్తిడిని అధిగమించే మెలకువలను ఆయన విద్యార్థులకు వివరించారు.

పోలీసులు నేర నివారణపై దృష్టి సారించాలి

సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర


సైబరాబాద్ కమిషనరేట్‌లో పోలీసు సిబ్బందికి రివార్డులు అందిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: సీసీఎస్ పోలీసులు నేర నివారణ, ఛేదనపై దృష్టి సారించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశించారు.శుక్రవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సీసీఎస్ శంషాబాద్ జోన్, బాలానగర్ జోన్, మాదాపూర్ జోన్లకు చెందిన పోలీసు సిబ్బందికి రివార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నేరగాళ్లు, అంతరాష్ట్ర ముఠాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీసీఎస్ పోలీస్ సిబ్బంది, ఇతర రాష్ట్రాల పోలీసులతో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు. 2022లో 60శాతం క్రైమ్ డిటెక్షన్ రేటు ఉందన్నారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ అవినాష్ మహంతి, డీసీపీ యోగేష్ గౌతమ్, ఏడీసీపీ క్రైమ్స్ నర్సింహ్మారెడ్డి, సీసీఎస్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బాలరాజు, సీసీఎస్ మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమార్, శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీహబ్ ప్రాంగణంలో ఐసీఐసీఐ బ్యాంక్ ప్రారంభం


టీహబ్ ప్రాంగణంలో ఐసీఐసీఐ బ్యాంకు ప్రారంభోత్సవంలో రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ తదితరులు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో శుక్రవారం ఐసీఐసీఐ బ్యాంక్‌ను ప్రారంభించారు. బ్యాంకు 17వ బ్రాంచ్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఐసీఐసీఐ బ్యాంకు అధికారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీ హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు, టీహబ్ వింగ్ కోఆర్డినేటర్ అనీష్ అంథోనీ, ఐసీఐసీఐ బ్యాంక్ హైదరాబాద్ సిటీ సీబీహెచ్ ప్రశాంత్‌సింగ్ ,సిటీ హెడ్ సందీప్‌రెడ్డి, జెడ్‌హెచ్ వినీత్‌మల్హోత్రా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'కక్షతో కూల్చివేయించారు'

మియాపూర్ : బీజేపీ దళిత మహిళ ఏర్పాటు చేసుకున్న పాలబూత్‌ను బీఆర్‌ఎస్ నాయకులు కక్షతో కూల్చివేయించారని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు యోగానంద్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పాపిరెడ్డి కాలనీలోని ఆరంభ టౌన్‌షిప్ వద్ద బీజేపీ నాయకురాలు కాంచన కృష్ణ పాలబూత్‌ను శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారు. ఈ విషయం తెలుసుకున్న యోగానంద్ అక్కడకు వచ్చారు. ఆరంభ టౌన్‌షిప్ అసోసియేషన్ అనుమతులతో 2020లో టెండర్ ద్వారా పాల బూత్ తీసుకున్నారన్నారు .కాంచన కృష్ణ విస్తృత సేవా కార్యక్రమాలకు ప్రజలు బీజేపీ వైపు మొగ్గుచూపడం భరించలేక కార్పొరేటర్, ఎమ్మెల్యే షాపును కూల్చివేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హెచ్‌సీయూలో ముగిసిన రెండు రోజుల సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజివ్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు శుక్రవారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ జే రాణి రత్నప్రభ రచించిన 'భారత దేశంలో అసంఘటిత కార్మికులు: సమస్యలు , సవాళ్లు' అనే పుస్తకాన్ని నోయిడా వివిగిరి లేబర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ అమిత్‌నిర్మల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. హెచ్‌సీయూ ప్రోవీసీ ఆర్‌ఎస్ సర్రాజు, సీఎస్‌ఎస్ఇఐపీ వ్యవస్థాపకుడు సుధాకర్‌రావు,మాజీ ప్రోవీసీ రాజశేఖర్, ప్రొఫెసర్లు ఆశీమ్‌ప్రకాశ్‌అజై, శ్రీపతిరాయుడు, రాజమోహన్ రావు, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థిపై వీధికుక్కల దాడి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ విద్యార్థిపై వీధి కుక్కలు దాడి చేసిన సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. విద్యుత్‌కాలనీలో నివాసముండే ముదాబ్బీర్ ఇంటర్ చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోంచి బయటకు వచ్చాడు. ఆ సమయంలో వీధికుక్కలు ఒక్కసారిగా ఆ విద్యార్థిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు పటాన్‌చెరు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నారాయణగూడకు తరలించారు. కాలనీలో ఏ వీధికి వెళ్లినా వీధి కుక్కలగుంపు భయపెడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.